సాక్షి వైఎస్ఆర్ జిల్లా

మంగళవారం । 15 । జూలై । 2025



బౌలర్ల ధాటికి బ్యాటర్ల విలవిల

ఏసీఏ అండర్-16 మల్టీడే మ్యాచ్‌లు రెండవ రోజు కొనసాగాయి. వైఎస్ఆర్ఆర్ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో నెల్లూరు జట్టుపై కర్నూలు జట్టు విజయం సాధించింది. - 8లో



హైటెన్షన్ విద్యుత్ లైన్ల నిర్మాణం అడ్డగింత

పవర్ గ్రిడ్ సంస్థ చేపట్టిన 400 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ల నిర్మాణపు డిజైన్లు లోపభూయిష్టంగా ఉన్నాయని రైతులు పనులు అడ్డుకున్నారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.0 /27.3

జిల్లాలో సోమవారం 27.3 - 37.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 25.74 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఓపెన్ ఇంటర్ నోటిఫికేషన్ విడుదల

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ ఇంటర్మీడియట్ 2025- 26 సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదలైయిందని ఏఐ కోఆర్డినేటర్ చెప్పలి రాజారావు తెలిపారు. రెండేళ్ల కోర్సు ఒకే సంవత్సరంలో పూర్తయ్యేలా అడ్మిషన్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఓపెన్ ఇంటర్ అడ్మిషన్లు కావలసినవారు 10వ తరగతి పాస్ అయి ఉండాలని తెలిపారు. పదవ తరగతి మార్క్ లిస్ట్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, కుల సర్టిఫికెట్‌తోపాటు ఒక ఫొటోతో కడప రిమ్స్ రోడ్డులోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కలవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9182099672 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

16న ఫుట్‌బాల్ ఎంపికలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ మెన్ జిల్లా సెలెక్షన్స్ ఈనెల16న కడప ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో నిర్వహించనున్నట్లు వైయస్సార్ కడప జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డేనియల్ ప్రదీప్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్, బర్త్ సర్టిఫికెట్ జిరాక్స్‌తో పాటు మూడు ఫొటోలను తీసుకు రావాలని కోరారు.

ఏపీపీఎస్సీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

-జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు

కడప సెవెన్ రోడ్స్: జిల్లాలోని 7 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఏపీపీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి యం. విశ్వేశ్వర నాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఈనెల 15 నుంచి 23 తేదీ వరకు పరీక్షలు ఉంటాయన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అలాగే మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని ఏడు కేంద్రాల్లో జరగనున్న పరీక్షలు ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఏపీపీఎస్సీ జిల్లా ప్రత్యేక అధికారులు ఎస్. అంజమ్మ, పి. పద్మప్రియ తదితరులు పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక నూతన కార్యవర్గం ఎన్నిక



శ్రీనివాసులు విశ్వనాథ్ పైల రమేష్‌రాజు

కడప ఎడ్యుకేషన్: జేవీవీ రాష్ట్ర 18వ మహాసభలను పురస్కరించుకుని కడపలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఇందులో రాష్ట్ర సంఘానికి జరిగిన ఎన్నికలలో నెల్లూరు జిల్లాకు చెందిన కె.శ్రీనివాసులు రాష్ట్ర అధ్యక్షుడిగా, కడప జిల్లాకు చెందిన బి.విశ్వనాథ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా, విజయనగరం జిల్లాకు చెందిన డాక్టర్ పైల రమేష్ రాజు రాష్ట్ర కోశాధికారిగా ఎన్నికయ్యారు. ఎన్నికలలో కడప జిల్లాకు చెందిన భాస్కర్ రాష్ట్ర కార్యదర్శి గా,కె.సురేష్‌బాబు రాష్ట్ర సలహా మండలి సభ్యునిగా ఎన్నికయ్యారు. కమిటీలో కడప జిల్లాకు తగిన ప్రాధాన్యత దక్కడం హర్షణీయమని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ బ్రహ్మారెడ్డి ఆకాంక్షించారు.

కొత్త కార్యవర్గం ఎన్నిక

కడప సెవెన్ రోడ్స్: ఏపీ పంచాయితీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్, ఇంజనీరింగ్ విభాగాల విశ్రాంతి ఉద్యోగుల సంఘం జిల్లా కొత్త కార్యవర్గం ఎన్నిక సోమవారం జెడ్పీ ఆవరణంలోని డీఆర్‌సీ భవనంలో జరిగింది. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీ రంగాచార్యులు అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా ఏ ముకుందరెడ్డి, ఉపాధ్యక్షుడిగా జి. కేశవులు, ప్రధాన కార్యదర్శిగా ఇవి రమణ, ట్రెజరర్‌గా సి. కృష్ణారెడ్డి, అడ్వయిజర్‌గా డాక్టర్ సిజ వెంకటేష్, కన్వీనర్లుగా కె. చంద్రశేఖర్ రెడ్డి, ఎంవి నరసింహులు, ఉమెన్ కో-ఆర్డినేటర్‌గా సి. నిర్మలా దేవి, ఎన్‌వి తాయారమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సమస్యలు పరిష్కరించాలి...

విశ్రాంత ఉద్యోగులకు లీవ్ ఎన్ క్యాస్‌మెంట్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఈ సందర్భంగా వారు కోరారు. పెన్షనర్ల బెనిఫిట్స్ వెంటనే విడుదల చేయాలన్నారు.

ఘనంగా చక్ర త్రిశూల స్నానం

రాజంపేట : తాళ్లపాక బ్రహ్మోత్సవాలలో భాగంగా అన్నమాచార్య ధాన్యమందిరం ఆవరణంలోని కళ్యాణవేదికపై శ్రీ సిద్దేశ్వరస్వామికి త్రిశూల స్నానం, శ్రీ చెన్నకేశవస్వామికి చక్రస్నానం కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, ప్రత్యేకపూజలు జరిపారు. టీటీడీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. అంతకముందు వసంతోత్సవాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ సిద్దేశ్వరస్వామి, శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు.

మహా విషాదం



మృతదేహాలవద్ద విలపిస్తున్న బంధువులు



మృతులు చెంచమ్మ(54), చిట్టమ్మ(30), వి. శ్రీను(28), గజ్జలగంగమ్మ(33), గజ్జలదుర్గయ్య(37), ముని చంద్ర(26), రాధమ్మ (31), జానీ (15), సుబ్బరత్నమ్మ (31) (ఫైల్)

- కన్నీటిలో శెట్టిగుంట ఎస్టీ కాలనీ
- ఎవరిని కదిపినా కన్నీరే
- రాజంపేట హాస్పిటల్‌లో పూర్తయిన పోస్టుమార్టం

సాక్షి రాయచోటి/రైల్వేకోడూరు అర్బన్ : అమాయక గిరిజనులు...పొట్టకూటి కోసం.. రోజువారి కూలీ కోసం ఊరుగాని ఊరొచ్చారు. ఎంతోకొంత సంపాదించుకోవచ్చని ఆశపడ్డారు. ఆ ఆశలపై విధి చిన్నచూపు చూసింది. ప్రమాదమై దూసుకొచ్చి విషాదగీతిక రాసింది. రాజంపేట-రైల్వేకోడూరు మధ్యలోని పుల్లంపేట మండలం రెడ్డివారిపల్లె చెరువు కట్టపై జరిగిన ప్రమాదం ఆయా కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చింది. జీవితానికి సరిపడా చేదు జ్ఞాపకాల్ని మిగిల్చింది.

వారి వేదన...అరణ్య రోదన

అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు పరిధిలోని శెట్టిగుంట యానాదుల కాలనీలో బాధిత కూలీల కుటుంబాల రోదన అరణ్య వేదనగా మారింది. ఓ వైపు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూనే...తెల్లవారిన అనంతరం మృతదేహాల వద్దకు వారు వచ్చారు. ప్రమాదంలో మృతి చెందిన వారంతా బంధువులే. ఒకరునొకరు వరుసకు సోదరుడు, బావమరిది, చిన్నమ్మ, భర్త ఇలా... ఒకరినొకరితో బంధుత్వాలు కలిగి ఉన్నారు. అంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో వారి బంధువుల ఆవేదన వర్ణణాతీతంగా మారింది. రాజంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద వివరాల కోసం సమాచారం అడుగుతున్నా చెప్పలేని పరిస్థితుల్లో ఉండిపోయారు.

కాలనీలో కన్నీటి ఘోష

రైల్వేకోడూరు పరిధిలోని యానాదుల కాలనీలో కన్నీటి ఘోష కనిపిస్తోంది. కాలనీకి చెందిన 9 మంది మృతి చెందడం, మరో 13 మందికి గాయాలు కావడంతో ఆ ప్రాంతమంతా తల్లడిల్లిపోయింది. కొద్ది సేపట్లో గమ్య స్థానానికి చేరుకుంటారని అనుకుంటున్న తరుణంలోనే ఇలా ఒక్కసారిగా ఉపద్రవం ముంచుకొచ్చిందంటూ తలుచుకుని కన్నీటిపర్యంతమవుతున్నారు.

పొట్టకూటికోసం వచ్చి....

అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు పరిధిలోని శెట్టిగుంట ఎస్టీ కాలనీలోకి కొంతమంది యానాదులు పనుల కోసం వలస వచ్చారు. ప్రధానంగా వెంకటగిరి, రేణిగుంట పరిధిలోని రెండు గ్రామాలకు చెందిన సుమారు 20-30 కుటుంబాలు పనుల కోసం వచ్చాయి. పొట్టకూటికోసం ఎక్కడో దూర ప్రాంతాల నుంచి పనుల కోసం వలసవచ్చి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

రోడ్డు ప్రమాద ఘటనలో గాయపడిన వారిని రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, ఇతరవైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. మార్చురీ వద్ద మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబాలకు ప్రగాడ సానుభూతి తెలియజేశారు. ఇంత పెద్ద ఘటన జరగడం బాధాకరమని, వెంటనే ప్రభుత్వం బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇంతవరకు ప్రభుత్వం పరిహారం ప్రకటించకపోవడంపై మండిపడ్డారు. వెంటనే ఆదుకునే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు.

అతివేగమే ప్రాణం తీసిందా

రెడ్డిపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో డ్రైవర్ నిర్లక్ష్యం, అతి వేగం ప్రాణం తీసిందని తెలుస్తోంది. దీనికి తోడు కూలీలను తీసుకెళ్లే మేస్త్రీ, వ్యాపారులు పని చేయించుకొని వారిని వదిలేశారు. వారి తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు చేయకుండా రాత్రి వేలలో నిబంధనలకు విరుద్ధంగా అంత మందిని లోడ్ పైన ఎక్కించి ప్రయాణం చేయించడంపై బాధితుల బంధువులు మండిపడుతున్నారు.

అనాథలైన పిల్లలు

గజ్జల గంగమ్మ, దుర్గయ్యలు ప్రమాదంలో మృతి చెందడంతో వారిపిల్లలు సునీతమ్మ, రాజీ, గంగయ్యలు అనాథలయ్యారు. మృతదేహాలవద్ద వారి తాత పిల్లలను ఓదార్చలేక పోయాడు.

ఒకే చోట అంత్యక్రియలు

ఆఊరికి ఎప్పుడూ లేనంత కష్టం వచ్చింది. ఒకేమారు నలుగురు మృతి చెందడం మృతదేహాలను ఖననం చేయడానికి గుంతలు తీయడానికి సమయం సరిపోలేదు. దీంతో జేసీబీతో గుంతలు తవ్వి ఖననం చేశారు.

అమ్మా... ఎందుకు ఏడుస్తున్నావు!



భర్త మృతితో తల్లడిల్లిపోతున్న విజయలక్ష్మి.. తల్లిని అమాయకంగా చూస్తున్న ఆమె పిల్లలు

ఈ ఫొటోలో వీల్‌చైర్‌లో కూర్చొన్న మహిళ పేరు విజయలక్ష్మి . మామిడి పండ్లు లోడింగ్ చేసేందుకు భార్య,భర్త వెళుతూ చిన్న పిల్లలైన గంగోత్రి, చెంచితలను కూడా తీసు కెళ్లారు. అనుకోని ప్రమాదం ఎదురు కావడంతో విజయలక్ష్మి తన పిల్లలు ఇద్దరినీ గట్టిగా పట్టుకుని పడిపోయింది. దీంతో పిల్లలకు చిన్న పాటి గాయాలయ్యాయి. ప్రమాదంలో భర్త శ్రీనివాసులు మృతి చెందాడన్న వార్త జీర్ణించుకోలేకపోతోంది. విజయలక్ష్మికి గాయాలు కావడంతో నడవలేని స్థితిలో ఉంది. మరోవైపు విజయలక్ష్మి తండ్రి వెంకటయ్యకు కూడా చేయి విరగడంతో ఎదురుగా కూర్చొని విలపిస్తున్నాడు. ఏమీ తెలియన చిన్నారులు మాత్రం నాన్న లేరన్న విషయం తెలియక అమ్మా ఎందుకు ఏడుస్తున్నావు అంటూ వారు కూడా ఏడుస్తున్నారు. రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద సోమవారం కనిపించిన ఈ దృశ్యం చూపరులను కంటతడి పెట్టించింది.



అనాథలైన పిల్లలు

క్షతగాత్రులకు ప్రభుత్వం అండగా ఉంటుంది : మంత్రి

రాజంపేట : రెడ్డిపల్లె చెరువుపై ఆదివారం లారీ బోల్తా సంఘటనలో క్షతగాత్రులకు ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. రాజంపేట ప్రాంతీయవైద్యశాలలో ఉన్న క్షతగాత్రులను కలెక్టర్ శ్రీధర్ చామకూరితో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జరిగిన ప్రమాదసంఘటనపై సీఎంతో మాట్లాడనన్నారు. సీఎం సూచన మేరకు క్షతగాత్రులను పరామర్శించామన్నారు. బాధితు కుటుంబాలను ఏవిధంగా ఆదుకోవాలనే విషయం ప్రభుత్వానికి నివేదిక ఇచ్చి నిర్ణయం తీసుకుంటామన్నారు. కలెక్టరు శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ జరిగిన సంఘటన దురదృష్టకరమన్నారు.రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కారూపానందరెడ్డి, టీడీపీ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు చమరి జగన్ మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి



మేడా రఘునాథరెడ్డి

రాజంపేట : పుల్లంపేట మండలంలోని రెడ్డిపల్లె చెరువుకట్టపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం అయన మాట్లాడుతూ రెక్కాడితేకాని డొక్కాడని కుటుంబాలకు ఇలా జరగడం చాలా బాధకరమన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తున్నన్నారు. హాస్పిటల్ చికిత్స పొందుతున్న త్వరగా కోలుకోనే విధంగా వైద్య సేవలందించాల న్నారు.

బాధితులకు చట్టపరిధిలో న్యాయం చేయండి

– జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్

కడప అర్బన్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు వచ్చిన ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. జిల్లా నలు మూలల నుంచి విచ్చేసిన ప్రజలతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమానికి 180 పిటీషన్‌లు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, మహిళా పీఎస్ డీఎస్పీ బాలస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

తాళ్లపాక చెరువులో వెలుగులోకి ప్రాచీన శివలింగం

రాజంపేట : పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలి తాళ్లపాక చెరువులో నేరుడుగడ్డగా పిలిచే ప్రాంతంలో ప్రాచీన శివలింగం వెలుగులోకి వచ్చింది. సోమవారం చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా వెయ్యేళ్ల చరిత్ర కలిగిన సుమారు ఆరు అడుగుల ఎత్తు కలిగిన శివలింగం బయటపడింది. అదే విధంగా పురాతనమైన రోలు వెలుగుచూసింది. దీంతో గ్రామస్తులు, రాజంపేట పరిసర ప్రాంతాల ప్రజలు తండోపతడాలుగా తాళ్లపాక చెరువు వద్దకు చేరుకున్నారు. శివలింగానికి అభిషేకాలు, పూజలు చేశారు. శ్రీ సిద్దేశ్వరాలయం ప్రధాన అర్చకులు భక్తవత్సలం స్వామి పూజలు నిర్వహించారు. తాళ్లపాక చెరువులో వెలుగులోకి వచ్చిన పురానత శివలింగంపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు, రిటైర్డ్ పాలిటెక్నికల్ ప్రిన్సిపాల్ ఉద్దండం సుబ్రమణ్యం మాట్లాడుతూ ఇక్కడతవ్వకాలు చేపడితే చరిత్ర బయపడుతుందన్నారు. తాళ్లపాక చెరువు అభివృద్ధిలో భాగంగా శివాలయం కూడా నిర్మితం చేసే విధంగా టీటీడీ యోచించాలన్నారు.



పురాతన శివలింగానికి పూజలు

చిన్నారుల ఆరోగ్యంతో చెలగాటం!

- అంగన్వాడీలకు పురుగుల కందిపప్పు పంపిణీ
- జిల్లా వ్యాప్తంగా ఇదే దుస్థితి
- తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు	13
అంగన్వాడీ కేంద్రాలు	2389
చిన్నారులు	1,02,234
గర్భిణులు	13256
బాలింతలు	13,719

కడప కోటిరెడ్డిసర్కిల్ : చిన్నారుల ఆరోగ్యంతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోంది. అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసే పౌష్టికాహారాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సింది పోయి.. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నాసిరకం కందిపప్పును సరఫరా చేస్తోంది. ఒకటి కాదు..రెండు కాదు..జిల్లాలోని దాదాపు అన్ని అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఇదే దుస్థితి నెలకొంది. పురుగులతో బూజు పట్టిన కందిపప్పును సరఫరా చేయడంపై చిన్నారుల తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

వైఎస్సార్ జిల్లాలో 2389 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల పరిధిలో 1,02,235 మంది చిన్నారులు విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నారు. అలాగే 13,256 మంది గర్భిణులు, 13,719 మంది బాలింతలు ఉన్నారు. వీరందరికీ రాష్ట్ర ప్రభుత్వం పౌష్టికాహారం అందజేసేందుకు బాల సంజీవిని పథకం అమలు చేస్తోంది. ఇందులో భాగంగా పది రకాల నిత్యావసర సరుకులను అందజేస్తారు. అందులో బియ్యం మూడు కేజీలు, కందిపప్పు ఒక కిలో, నూనె 500 ఎంఎల్, 25 కోడిగుడ్లు, ఐదు లీటర్ల పాలు, 2 కిలోల రాగిపిండి, కిలో అటుకులు, 250 గ్రాముల బెల్లం, ఎండు ఖర్జూరాలు 250 గ్రాములు, వేరుశనగ చిక్కీలు 250 గ్రాములు అర్హులైన ప్రతి లబ్ధిదారు ఇంటికి సరఫరా చేస్తారు. ఈ పంపిణీలో భాగంగా ఇటీవల కూటమి ప్రభుత్వం జిల్లాలోని అంగన్వాడీ చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు కందిపప్పును సరఫరా చేసింది. ఇలా సరఫరా చేసిన కందిపప్పు పురుగు పట్టి నాసిరకంగా ఉండడం అనేక విమర్శలకు తావిస్తోంది.



నాసిరకం కందిపప్పు పొడిగా మారిన దృశ్యం

నాణ్యమైన సరుకులు ఇవ్వాలి



అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పంపిణీ చేసే పౌష్టికాహారం నాణ్యతగా ఉండాలి. కూటమి ప్రభుత్వంలో కందిపప్పు నాసిరకం ఉంది. నిత్యావసర సరుకులను సకాలంలో అందించడంతో పాటు నేరుగా అంగన్వాడీ కేంద్రాలకు అందిస్తే మాకు తిప్పలు తప్పుతాయి. ఈ విషయంగా ప్రభుత్వం సత్వరమే స్పందించాలి.

– మంజుల, రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అసోసియేషన్, కడప

కమీషన్ల కోసం కక్కుర్తి

అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్యాన్ని కూటమి సర్కార్ గాలికొదిలేసింది. పౌష్టికాహారానికి ప్రాధాన్యత ఇవ్వాల్సింది పోయి కాంట్రాక్టర్ల నుంచి కమీషన్ల కోసం కక్కుర్తిపడి పురుగు పట్టిన నాసిరకం కందిపప్పును కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలనలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టారు.

• రాజోలికి జలకళ

కృష్ణా జలాలతో రాజోలి ఆనకట్ట జలకళ సంతరించుకుంది. శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి వరద నీరు రాజుపాళెం మండల పరిధిలోని రాజోలి ఆనకట్టకు భారీగా వచ్చి చేరుతోంది. ఆదివారం ఆనకట్ట నుంచి కుందూనదిలోకి 4479 క్యూసెక్కులు నీరు పోతోందని కేసీ కెనాల్ అధికారులు వెల్లడించారు. కేసీ ప్రధాన, చాపాడు కాలువలకు నీరు అధికారికంగా విడుదల చేయలేదని తెలిపారు. ఇప్పటికే సాగు చేసిన మొక్కజొన్న పంటకు నీటితడులు అందించగా పత్తి, వరి పంటలను సాగు చేసుకునేందుకు రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. – రాజుపాళెం



రాజోలి ఆనకట్ట వద్ద వరద ప్రవాహం



కేసీ ప్రధాన కాలువలో పోతున్న నీరు



వెల్లాల వద్ద కుందూనదిలో ...

వైభవంగా పుష్పయాగం

– ముగిసిన సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు

నందలూరు : నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత స్వామివారికి పుష్పయాగం వైభవంగా జరిగింది. చామంతి, గన్నేరు, మల్లెలు, రుక్షి, కనకాంబరాలు, రోజా, సంపంగి, తామర, కలువ, మొగలిరేకులు వంటి వివిధ రకాల పుష్పాలు, తులసి, మరువం, ధవనం వంటి ఆకులతో స్వామి, అమ్మవార్లకు యాగం నిర్వహించారు. పాంచరాత్ర ఆగమ పండితులు రఘునందన్, పవన్‌కుమార్, మనోజ్‌కుమార్, సునీల్‌కుమార్, సాయిస్వామిలు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ హనుమంతప్ప, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం పాల్గొన్నారు.



పుష్పయాగం నిర్వహిస్తున్న పండితులు

ఒంటిమిట్టలో పూర్తిస్థాయిలో అన్నప్రసాద వితరణకు చర్యలు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో భక్తులకు పూర్తిస్థాయిలో అన్నప్రసాద వితరణకు చర్యలు చేపట్టాలని టీటీడీ ఈఓ శ్యామలరావు అధికారులను ఆదేశించారు. టీటీడీ పరిపాలనా భవనంలోని కార్యనిర్వహణాధికారి ఛాంబర్‌లో జేఈఓ వి.వీరబ్రహ్మంతో కలిసి సోమవారం అధికారులతో ఈఓ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఒంటిమిట్టలో ఏప్రిల్ 11న జరిగిన కోదండరామస్వామి కల్యాణోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుమల తరహాలో ఒంటిమిట్టలో భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేయాలని ఆదేశించారన్నారు. ఈ నేపథ్యంలో ఆలయం వద్ద తాత్కాలికంగా జర్మన్ షెడ్లు ఏర్పాటు చేసి ఆగస్టు నుంచి అన్న ప్రసాదాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో. ఎఫ్ఏ అండ్ సిఏఓ బాలాజీ, సిఈ సత్యనారాయణ, ఎస్ఈలు జగదీశ్వర్ రెడ్డి, మనోహరం, అన్నప్రసాదం, డిప్యూటీ ఈఓ రాజేంద్ర పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళ అదృశ్యం


అంకాలమ్మ(ఫైల్)

ముద్దనూరు : మండలంలోని ఆకుతోటపల్లె గ్రామానికి చెందిన దేనేపల్లె అంకాలమ్మ (32)కనిపించకపోవడంతో సోమవారం పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. సీఐ దస్తగిరి సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అంకాలమ్మకు ఆంజనేయులు అనే వ్యక్తితో సుమారు 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. గత కొద్ది కాలం నుంచి ఆమె పులివెందులలోని కుట్టు శిక్షణకు వెళ్తోంది. రోజూ మాదిరిగానే ఈనెల 9వ తేదీన ఉదయం కుట్టు శిక్షణకు అని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. బంధువులను, తెలిసిన వారిని విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. సోమవారం అంకాలమ్మ సోదరుడు నల్లబల్లె వీరాంజినేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


పెద్ద పాపిరెడ్డి మృతదేహం

మైలవరం : మండల పరిధిలోని ధన్నవాడ గ్రామానికి చెందిన పెద్ద పాపిరెడ్డి అనే రైతు అప్పుల బాధ తాళలేక పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ధన్నవాడ గ్రామానికి చెందిన పాపిరెడ్డి 10 ఎకరాల భూమిని సాగు చేస్తుండగా.. అందులో మిరప పంట వేసి నష్టాలు వచ్చాయి. అదే విధంగా ఆయనకు అనారోగ్య రీత్యా కూడా హాస్పిటల్‌లకు చాలా డబ్బులు ఖర్చు అయ్యాయి. దీంతో పంటలకు సరియైన గిట్టుబాటు ధరలు లేక అప్పులు ఎక్కువ కావడంతో మండల పరిధిలోని దొమ్మరనంద్యాల రెవెన్యూ పరిధిలో ఉన్న ప్లాట్లలో ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు ఎంత సేపటికి ఫోన్ చేస్తున్నా తీయక పోవడంతో.. ఉదయం వాకింగ్ వెళ్లిన ప్రదేశాల్లో బంధువులు గాలించడముతో మృతి చెందిన పాపిరెడ్డి కనిపించాడు. ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు సమాచారం రావడంతో ఎస్‌ఐ శ్యాం సుందర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మార్చురీలో గుర్తు తెలియని మృతదేహం



ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జిల్లా ఆస్పత్రిలోని మార్చురీలో అనారోగ్యంతో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని భద్రపరిచారు. మృతుడికి 38 ఏళ్లు ఉంటాయని ఆస్పత్రి అధికారులు తెలిపారు. అతను ఈ నెల 7న అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరాడు. ఆస్పత్రి సిబ్బంది ఎంఎం–3 వార్డులో ఉంచి అతనికి చికిత్స అందిస్తూ వచ్చారు. ఈ క్రమంలో ఆరోగ్యం క్షీణించడంతో సోమవారం మృతి చెందాడు. మృతుడికి సంబంధించిన వ్యక్తులు ఎవరైనా ఉంటే ఆస్పత్రిలోని ఔట్‌పోస్టు అధికారులను సంప్రదించాలని మార్చురీ ఇన్‌చార్జి వరాలు తెలిపారు.

20న బ్యాడ్మింటన్ ఎంపికలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఉమ్మడి కడప జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలను ఈ నెల 20వ తేదీన పులివెందులలోని వైయస్సార్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ సంఘ అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి, పి.శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 19 బాల బాలికలకు, అలాగే సీనియర్స్ విభాగంలో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. సింగిల్స్, డబుల్ విభాగంలో విడివిడిగా పోటీలను నిర్వహించి జిల్లా జట్టును ఎంపిక చేస్తామన్నారు. అండర్ 19 విభాగంలో పాల్గొనదలచు క్రీడాకారులు 2007 జనవరి 1న తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. సీనియర్స్ విభాగంలో ఎవరైనా పాల్గొనవచ్చన్నారు. క్రీడాకారులు తమ ఎంట్రీలను ఈనెల 18వ తేదీ సాయంత్రం లోపు చేసుకోవాలన్నారు. డబుల్ విభాగంలో పార్ట్నర్ పేరు తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈ పోటీలలో పాల్గొనదలచు క్రీడాకారులు ఆదివారం ఉదయం తొమ్మిది గంటల లోపు హాజరు కావలసి ఉంటుందన్నారు. వివరాలకు 9440107080, 9440223908 నంబర్లకు సంప్రదించాలని వివరించారు.

హైటెన్షన్ విద్యుత్ లైన్ల నిర్మాణం అడ్డగింత

- డిజైన్ లోపభూయిష్టంగా ఉందని రైతులు అభ్యంతరం
- డిజైన్ మార్చే వరకు అనుమతించబోమని అల్టిమేటం


చింతకొమ్మదిన్నె విద్యుత్ టవర్ నిర్మాణాన్ని అడ్డుకుని నిలుపుదల చేయిస్తున్న రైతులు

చింతకొమ్మదిన్నె : పవర్ గ్రిడ్ సంస్థ చేపట్టిన అనంతపురం– కడప 400 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ల నిర్మాణపు డిజైన్లు లోపభూయిష్టంగా ఉన్నాయని అభ్యంతరం తెలుపుతూ రైతులు పనులు అడ్డుకున్నారు. చింతకొమ్మదిన్నె చెరువులో పవర్ గ్రిడ్ సంస్థ చేపట్టిన హైటెన్షన్ విద్యుత్ టవర్ నిర్మాణ ప్రాంతానికి వారు సోమవారం చేరుకుని తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేసి నిర్మాణాన్ని నిలుపుదల చేయించారు. విద్యుత్ లైన్ల నిర్మాణం కోసం తయారు చేసిన డిజైన్ కడప– రాయచోటి జాతీయ రహదారి వెంట ఉన్న పొలాల్లో 3 కిలోమీటర్లకుపైగా వెళ్తోందని వారు తెలిపారు. జాతీయ రహదారికి సమాంతరంగా పొలాల మీదుగా విద్యుత్ లైన్ల టవర్ల నిర్మాణానికి పవర్ గ్రిడ్ సంస్థ లోపభూయిష్టమైన డిజైన్ల తయారీ కారణంగానే ఈ సమస్య తలెత్తిందని పేర్కొన్నారు. సమస్య పరిష్కారం కోసం ఏడాది క్రితమే పవర్ గ్రిడ్ సంస్థ అధికారులను అనంతపురం, గుత్తి, కడప కార్యాలయాలలో సంప్రదించి అర్జీలు సమర్పించినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. అప్పుడే కడప జిల్లా కలెక్టర్‌కు కూడా గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు.

విలువైన భూములు కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన

పక్కా వ్యాపార సంస్థ అయిన పవర్ గ్రిడ్ సంస్థ అత్యంత విలువైన జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పొలాల మీదుగా నిర్మాణానికి లోపభూయిష్టమైన డిజైన్లు తయారు చేయడంతో కోట్లాది రూపాయల విలువైన భూములు కోల్పోవాల్సి వస్తోందన్నారు. దీనివల్ల తమ పిల్లల భవిష్యత్తు, చదువులు కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొలుములపల్లె పంచాయతీ పాలకవర్గం, అధికారులు కూడా ఇదివరలోనే తమ గ్రామ పొలాల మీదుగా హై టెన్షన్ విద్యుత్ లైన్ల నిర్మాణానికి అభ్యంతరం తెలుపుతూ రెజుల్యూషన్ కూడా పాస్ చేసి పవర్ గ్రిడ్ అధికారులకు అందజేశారని తెలిపారు. నెల క్రితం కూడా కడప రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్ ఇర్విన్, చింతకొమ్మదిన్నె మండల తహసీల్దార్ నాగేశ్వరరావు సమక్షంలో క్షేత్రస్థాయి పర్యటనకు పవర్ గ్రిడ్ అధికారులు వచ్చినప్పుడు కూడా అభ్యంతరం తెలిపినట్లు చెప్పారు. దీంతో రెవెన్యూ అధికారులు పరిశీలించి తమ బాధను అర్థం చేసుకుని కడప నగర అభివృద్ధికి కూడా ఆటంకంగా ఈ విద్యుత్ లైన్ల నిర్మాణపు డిజైన్ ఉందని భావించి.. వారు సమీపంలోనే ఉన్న చింతకొమ్మదిన్నె చెరువు నుంచి గుట్టపై నుంచి పవర్ గ్రిడ్ కార్యాలయం వరకు విద్యుత్ లైన్ల నిర్మాణానికి రీడిజైన్ చేసుకోవాల్సిందిగా పవర్ గ్రిడ్ అధికారులకు సూచించారని తెలిపారు.

అనుమతి లేకుండా..

అయినా పవర్ గ్రిడ్ అధికారులు తీరు మార్చుకోక ఇటీవల తిరిగి రెవెన్యూ అధికారులకే పాత డిజైన్ మేరకు నిర్మాణం చేపట్టేందుకు పోలీసు భద్రత కల్పించాల్సిందిగా చింతకొమ్మదిన్నె తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న కొలుములపల్లి గ్రామ పొలంలో నష్టపోతున్న రైతులు, చింతకొమ్మదిన్నె రైతులు సోమవారం చింతకొమ్మదిన్నె చెరువులో అక్రమంగా ఎటువంటి పర్మిషన్ ఇరిగేషన్ అధికారుల నుంచి కానీ, రెవెన్యూ అధికారుల నుంచి తీసుకోకుండా ఏర్పాటు చేస్తున్న హైటెన్షన్ విద్యుత్ టవర్ నిర్మాణాన్ని అడ్డుకుని అధికారులతోనే నిలిపి వేయించారు. ఇప్పటికైనా పవర్ గ్రిడ్ అధికారులు, వారి ఉన్నతాధికారులు స్పందించి హై టెన్షన్ విద్యుత్ లైన్ల లోపభూయిష్టమైన డిజైన్లు మార్పు చేసుకుని సమీపంలోని గుట్టలపై నుంచి తీసుకెళ్లాలని రైతులు కోరుతున్నారు. అలా జరగకపోతే తాము ప్రాణాలు సైతం త్యాగం చేసైనా సరే.. విద్యుత్ లైన్ల నిర్మాణాలను తమ భూముల నుంచి వెళ్లకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.

అంజన్న మూలవిరాట్ దర్శనమే లక్ష్యం

- శ్రావణమాసంలో కల్పించేందుకు ఏర్పాట్లు
- ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ


మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ

చక్రాయపేట : శిలాఫలకాల్లో పేర్లు వేయించుకోవాలన్నది మా ఉద్దేశం కాదని, భక్తులకు వీరాంజనేయ స్వామి మూలవిరాట్ దర్శనం కల్పించాలన్నదే ముఖ్యమని గండి ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ టీడీపీ నేతలకు సూచించారు. గండిలో ఆలయ పాలకమండలి సభ్యులతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేంపల్లె మండల టీడీపీ ఇన్‌చార్జి రఘునాథరెడ్డి గండి ఆలయాన్ని శనివారం పరిశీలించి విలేకరుల సమావేశంలో తమపై పలు ఆరోపణలు చేశాడన్నారు. ఆలయం పనులు సుమారు 95 శాతం పూర్తయ్యాయని, పునఃప్రతిష్ట చేసి భక్తులకు శ్రావణ మాసం నాటికి మూల విరాట్ దర్శనం కల్పించాలని గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖమంత్రి, కమిషనర్, బీజేపీ, కాంగ్రెస్, నేతలతోపాటు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి విజ్ఞప్తి చేశానని చెప్పారు. తమ విన్నపాలకు స్పందించి విచారణ నిమిత్తం ఆర్జేసీ, కలెక్టర్, డిప్యూటీ కమిషనర్‌లు గండికి వచ్చి శ్రావణ మాసం నాటికి పునః ప్రతిష్ట జరిపించాలని ఆదేశించారని చెప్పారు. ఆగిన పనులు తమ విన్నపాలతోనే ఊపందుకున్నాయని చెప్పారు. తాము కూటమి ప్రభుత్వంపై ఎలాంటి ఆరోపణలు చేయలేదన్నారు. పునః ప్రతిష్ఠకు సంబంధించి కనీసం 6 అడుగుల ప్రాకారం, దీప స్తంభం ఉండాలని, బలిపీఠం కావాలని అధికారులు చెప్పారని తెలిపారు. వారు చెప్పినట్లు ప్రాకారం 6 అడుగులు, దీపస్తంభం ఉందని, బలిపీఠం ఒక్కటే లేదని చెప్పారు. నాలుగేళ్లుగా భక్తులకు మూల విరాట్ దర్శనం లేదని ఇప్పుడైనా ఆ అవకాశం కల్పించాలని తాపత్రయ పడుతున్నామని చెప్పారు.

రాజీనామా చేయాలనడం భావ్యం కాదు

గతంలో టీడీపీకి చెందిన వెంకటస్వామి వైఎస్‌ఆర్ సీపీ అధికారంలోకి రాగానే ఆలయ చైర్మన్ పదవికి రాజీనామా చేశారని టీడీపీ వారు పేర్కొంటున్నారని తెలిపారు. అది వెంకట స్వామి వ్యక్తిగత విషయం అన్నారు. ఆయన రాజీనామా చేశారని ఈ రోజు తాము రాజీనామా చేయాలనడం భావ్యం కాదన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తమకు ఉన్న పదవీ కాలం వరకు కొనసాగుతామని, రాజీనామా కోరడం భావ్యం కాదని ఆయన టీడీపీ నేతలకు హితవు చెప్పారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యుడు బోరెడ్డి వెంకటరామిరెడ్డి, మాజీ బోర్డు సభ్యుడు బ్రహ్మానందరెడ్డి, వేముల మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాధాకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పైసా వసూల్

- రిమ్స్‌లో ఓ ఉద్యోగిని హౌస్ సర్జన్ల నుంచి ముడుపులు
- ప్రతి నెల స్టైఫండ్ నుంచి రూ.1000 చొప్పున చెల్లించాల్సిందే
- బదిలీల్లోనూ డెంటల్ కళాశాలలో అదే సీటు కైవసం

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : కడప నగర శివారులోని ప్రభుత్వ వైద్యకళాశాల, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో విధులు నిర్వర్తిస్తున్న హౌస్ సర్జన్‌ల గౌరవ వేతనం నుంచి ప్రతి నెలా రూ. 1000 చొప్పున అనధికారికంగా కోత విధిస్తున్నారు. గత మూడేళ్లుగా హౌస్ సర్జన్‌ల విభాగం చూస్తున్న ఓ ఉద్యోగిని అనధికారికంగా డబ్బులను రాబడుతున్నట్లు సమాచారం. ప్రతి నెలా ఒక్కో హౌస్ సర్జన్‌కు వచ్చే రెమ్యునరేషన్ రూ.25,609 కాగా అందులో నుంచి రూ.1000 వసూలు చేస్తున్నట్లు తెలిసింది. గత మూడేళ్లుగా సదరు ఉద్యోగినికి తనకు వచ్చే జీతం కంటే.. అవినీతిగా వచ్చే డబ్బులు నెలకు రూ.1.70 లక్షలుగా వుందని తెలుస్తోంది. ఆ డబ్బులను ఏకంగా తన ఫోన్‌కు గానీ, తాను చెప్పిన వారి ఫోన్‌పే, గూగుల్‌పేకు గానీ, లేదంటే నగదు రూపంలోనైనా చెల్లిస్తుంటారు. ఇంతేగాక తాను ఎక్కడికి తిరగాలన్నా, ఎవరు ఎక్కడికి డ్రాప్ చేయాలన్నా హౌస్‌సర్జన్‌లలో కొందరు సాయం చేస్తుంటారు. హౌస్‌సర్జన్‌లకు ప్రతి నెల స్టైఫండ్‌కు సంబంధించిన డబ్బులను బిల్లుల రూపంలో ప్రభుత్వానికి సమర్పించేందుకు, వారి ఖాతాలలో వేయించేందుకు ప్రత్యేకంగా నియమించిన సీనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగిని ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. గత మూడేళ్లుగా ఆ ఉద్యోగిని అక్రమార్జనను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతోపాటు ఎఫ్ఎంజీ (ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేషన్) పూర్తి చేసుకుని కడప రిమ్స్‌లో పర్మిషన్ కోసం ఉద్యోగిని ఆశ్రయిస్తే.. ఆ విషయంలో కూడా అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు అక్కడ పని చేస్తున్న ఉద్యోగులే చర్చించుకుంటున్నారు. ఆ ఉద్యోగిని క్లినికల్ విభాగంలో ఎస్ఆర్‌హెచ్ఎంలో ఎస్ఎన్‌సీయూ విభాగం పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో అత్యున్నత స్థాయి సిఫారసుతో మరలా ప్రభుత్వ దంతవైద్య కళాశాలలో కూడా హౌస్ సర్జన్‌ల విభాగానికే తనను కేటాయించుకున్నట్లు సమాచారం. ఏది ఏమైనా సదరు ఉద్యోగిని అవినీతి పునరావృతం కాకుండా చూడాలని హౌస్‌సర్జన్లు కోరుతున్నారు.

ఎర్రచందనం కేసుల్లో నిందితుడిపై అటవీ అధికారుల దాడి

రిమ్స్ అవుట్ పోస్టులో ఫిర్యాదు చేసిన బాధితుడు


చికిత్స కోసం ప్రొద్దుటూరు ఆస్పత్రికి నాగేంద్రను తీసుకొచ్చిన అటవీ అధికారులు

మైదుకూరు : ఎర్రచందనం అక్రమ రవాణాకు సంబంధించి పలు కేసుల్లో నిందితుడుగా ఉన్న ఇడగొట్టు నాంద్రపై సోమవారం అటవీ అధికారులు దాడి చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. తనపై అటవీ అధికారులు దాడి చేశారంటూ బాధితుడు రిమ్స్ అవుట్ పోస్టులో ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మైదుకూరు మండలం జీవీ సత్రంలో సోమవారం నాగేంద్ర మరొక వ్యక్తితో కలిసి కారులో వెళుతుండగా అటవీ అధికారులు వారిపై దాడి చేసినట్టు తెలుస్తోంది. నాగేంద్ర పక్కనున్న వ్యక్తి పారిపోగా అటవీ అధికారులు నాగేంద్రపై దాడి చేయగా అతను తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. బాధితున్ని అటవీ అధికారులే తమ వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. వైద్య పరీక్షల్లో నాగేంద్ర కుడికాలు ఎముక విరిగినట్టు గుర్తించిన ఆస్పత్రి వైద్యులు మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు పంపారు. అటవీ అధికారులు తనపై దాడి చేసినట్టు రిమ్స్ ఔట్ పోస్టులో నాగేంద్ర ఫిర్యాదు చేశాడు.

నాగేంద్రపై దాడి చేయలేదు : ప్రొద్దుటూరు డీఆర్‌ఓ

ఎర్రచందనం కేసుల్లో నిందితుడుగా ఉన్న నాగేంద్రపై దాడి చేయలేదని ప్రొద్దుటూరు డీఆర్‌ఓ లక్ష్మీ కుమారి పేర్కొన్నారు. జీవీ సత్రంలో జరిగిన సంఘటన అనంతర ఆమె వివరణతో కూడిన వీడియోను విడుదల చేశారు. అనుమానాస్పదంగా ఉన్న కారును వెంబడించగా కారులోని వ్యక్తులు దిగి పారిపోబోయారని తెలిపారు. అందులో ఒకరు పారిపోగా కాలు మడతపడి గాయంతో నాగేంద్ర పట్టుబడ్డాడని పేర్కొన్నారు. వనిపెంటకు చెందిన నాగేంద్ర పలు రేంజ్‌లలో ఐదారు ఎర్రచందనం స్మగ్లింగ్ కేసుల్లో నిందితుడని తెలిపారు. మల్లేపల్లె వద్ద ఎర్రచందనం దుంగల స్టాక్ ఉందని దుంగలను తరలించేందుకు తాము తాడిపత్రి నుంచి వాహనాన్ని తీసుకుని వచ్చినట్టు విచారణలో నాగేంద్ర తమకు వెల్లడించాడని డీఆర్‌ఓ తెలిపారు. పారిపోయిన వ్యక్తి పేరు పవన్‌కుమార్‌రెడ్డిగా పేర్కొన్నట్టు తెలిపారు. పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న నాగేంద్ర ఇప్పుడు కూడా ఎర్రచందనం దుంగలను తరలించేందుకు వచ్చి పట్టుబడ్డాడని వివరించారు.

ఆచూకీ తెలపరూ..


యమున (ఫైల్)

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్జీఓ కాలనీలో వెంకటేశ్వరస్వామి గుడి ఎదురుగా నివాసం వుంటున్న పోకూరు యమున (28)తన ఇద్దరు కుమార్తెలు పోకూరి సిందూరి (9), పోకూరి కుసుమాంజలి (6)లు జూన్ 24వ తేదీ నుంచి కనిపించడం లేదని భర్త పోకూరు సురేష్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎన్.రాజ రాజేశ్వర్‌రెడ్డి తెలియజేశారు. జూన్ 23వ తేదీన యమున, తన కుమార్తెలతో కలిసి రాత్రి 11:30 గంటల సమయంలో తనతోపాటు ఇంటిలో నిద్రించారని, 24వ తేదీన తెల్లవారుజామున 5 గంటల సమయంలో తాను లేచి చూస్తే కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. తరువాత అన్ని చోట్ల వెతికామని, కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పై వ్యక్తుల ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా కింది సెల్‌నెంబర్లు: సీఐ 9121100520, ఎస్‌ఐలు 9121100521, 9121100522 లకు సమాచారం ఇవ్వాలని తెలియజేశారు.

ఎరువు దుకాణాల తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు రూరల్ : ప్రొద్దుటూరు పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలపై సోమవారం వ్యవసాయ శాఖ అధికారులు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడిలో మైదుకూరు రోడ్డులోని మహాలక్ష్మి ఫర్టిలైజర్స్ దుకాణ యజమాని హోల్‌సేల్‌కు సంబంధించిన ఎరువులను రీటైల్ దుకాణంలో ఉంచి అమ్మకాలు జరుపుతున్నట్లు వారు గుర్తించారు. సుమారు రూ.13 లక్షల విలువ చేసే హోల్‌సేల్ ఎరువుల అమ్మకాలను అధికారులు నిలుపుదల చేశారు. అలాగే ఎరువుల దుకాణాల లైసెన్స్‌లను, రికార్డులను, నిల్వలను పరిశీలించారు. ఈ దాడులలో కర్నూలు జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయ ఏడీఏ ఎస్.వెంకటేశ్వర్లు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ పి.మల్లికార్జున రావు, కడప జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయ టెక్నికల్ ఏఓ గోవర్ధన్, ప్రొద్దుటూరు మండల వ్యవసాయాధికారి వరిహరికుమార్ పాల్గొన్నారు.

కేంద్ర కారాగారంలో మరోసారి సెల్‌ఫోన్, ఛార్జర్ లభ్యం

అధికారుల మధ్య వాగ్వివాదం?

కడప అర్బన్ : కడప కేంద్ర కారాగారంలో మరోసారి ఆకస్మిక తనిఖీలలో ఓ సెల్‌ఫోన్, మరుసటి రోజున తనిఖీలలో ఛార్జర్ లభ్యమయ్యాయి. ఈ రెండు వస్తువులు మరలా జాకీర్ అనే పిడియాక్ట్ రిమాండ్ ఖైదీ వద్దనే లభించినట్లు సమాచారం. గతంలో విడతల వారీగా ఇప్పటి వరకు 11 సెల్‌ఫోన్‌లు లభించాయి. ఆయా వస్తువులు లభించినపుడు ఉన్నతాధికారుల హడావుడితో.. సెల్‌ఫోన్‌లు దొరికిన సమయంలో విధుల్లో వున్న వారిని బలిపశువులుగా చేసి కేసులను బనాయించడం, వారిని సస్పెన్షన్‌కు గురిచేయడం ప్రస్తుత ఇన్‌చార్జి డీఐజీ, కడప కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ రాజేశ్వరరావుకు పరిపాటిగా మారిపోయింది.

తాజాగా సెల్‌ఫోన్ గురువారం తనిఖీలలో దొరికితే, మరుసటి రోజున ఛార్జర్ లభించడం గమనార్హం. ఈ విధంగా వరుస క్రమంలో సెల్‌ఫోన్‌లు, ఛార్జర్‌లు లభ్యమవుతున్నా.. ఎర్రచందనం స్మగ్లర్, రిమాండ్ ఖైదీ ఏకంగా అధికారులకు సవాలు విసురుతున్నట్లు సమాచారం. సెల్‌ఫోన్, ఛార్జర్ దొరికిన తరువాత 11 సెల్‌ఫోన్‌లు దొరికినా, 12వ సెల్‌ఫోన్ కూడా తెప్పించుకుంటానంటూ కారాగార అధికారులకు సవాలు విసరడం జైళ్ల శాఖ అధికారుల పర్యవేక్షణలో కళంకంగా మారింది. ఈక్రమంలో ఓ డిప్యూటీ సూపరింటెండెంట్ తాను విధుల్లో వున్న సమయంలో సెల్‌ఫోన్, ఛార్జర్ దొరికిందని డైరీలో ఎంటర్ చేశారు. ఆ విషయాన్ని ఎందుకు తన దృష్టికి తీసుకుని రాలేదని సూపరింటెండెంట్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో వారిద్దరి మధ్య వాగ్వివాదం జరగడం, ఆ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడం జరిగిపోయింది. నేడో, రేపో బాధ్యులైన అధికారుల మీద ఉన్నతాధికారులు చర్యలను తీసుకునే అవకాశం వుంది.

బౌలర్ల ధాటికి బ్యాటర్ల విలవిల


నెల్లూరు నేత్ర నంద (5 వికెట్లు)


కర్నూలు వివేక్ (6 వికెట్లు)


కర్నూలు రుత్విక్ కళ్యాణ్ (5 వికెట్లు)


చిత్తూరు షారుక్ అక్తర్ (222 పరుగులు)

నెల్లూరు జట్టుపై కర్నూలు విజయం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్–16 మల్టీడే మ్యాచ్‌లు రెండవ రోజు కొనసాగాయి. వైఎస్‌ఆర్ అర్ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో కర్నూలు–నెల్లూరు జట్లు ఆడుతుండగా.. నెల్లూరు జట్టుపై కర్నూలు జట్టు 26 పరుగులతో విజయం సాధించింది. సోమవారం 81 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన నెల్లూరు జట్టు కర్నూలు బౌలర్ల ధాటికి 50.2 ఓవర్లలో 113 పరుగులకు ఆలౌట్ అయింది. కర్నూలు జట్టులోని పి.వివేక్ అద్భుతంగా బౌలింగ్ చేసి 6 వికెట్లు పడగొట్టాడు. యూహాస్ 4 వికెట్లు తీసి చక్కగా బౌలింగ్ చేశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు నెల్లూరు బౌలర్ల ధాటికి కేవలం 29.5 ఓవర్లలో 56 పరుగులకే ఆలౌట్ అయింది. నెల్లూరు జట్టులోని నేత్ర నంద తన చక్కటి బౌలింగ్‌తో 5 వికెట్లు తీశాడు. సుదాంత్ 4 వికెట్లు తీశాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన నెల్లూరు జట్టు 43 ఓవర్లకు 94 పరుగులు చేసి ఆలౌట్ అయింది. కర్నూలు జట్టులోని రుత్విక్ కళ్యాణ్ 5 వికెట్లు, యూహాస్ 3 వికెట్లు తీశారు. దీంతో రెండవ రోజే కర్నూలు జట్టు 26 పరుగులతో విజయం సాధించింది,

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో..

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన కడప–చిత్తూరు జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో 299 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో సోమవారం రెండవ రోజు మ్యాచ్‌ను ప్రారంభించిన చిత్తూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 71.4 ఓవర్లలో 383 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని ఎండి షారుఖ్ అక్తర్ 183 బంతుల్లో 31 ఫోర్లు, 7 సిక్సర్లతో 222 పరుగులు చేశాడు. కడప జట్టులోని గైబు 3 వికెట్లు, హితేష్ 4 వికెట్లు, తీశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 67 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 193 పరుగులు చేసింది. ఆ జట్టులోని సియండి ఫైజాన్ 58, పర్వాజ్ ఖాన్ లోడి 48 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని జయప్రకాశ్ 2 వికెట్లు తీశాడు. దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

'మధ్యవర్తిత్వం' ప్రచారంపై శ్రద్ధ వహించాలి


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని

కడప అర్బన్ : దేశం కోసం మధ్యవర్తిత్వంపై ప్రచారం, అవగాహన కల్పించేందుకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ డాక్టర్ సి.యామిని అన్నారు. సోమవారం రాష్ట్ర న్యాయసేవాధికారసంస్థ ఆదేశానుసారంగా జిల్లా వ్యాప్తంగా న్యాయమూర్తులతో నిర్వహించిన వర్చువల్ మీటింగ్ ద్వారా జిల్లా ప్రధాన న్యాయమూర్తి వారికి దిశానిర్దేశం చేశారు. కూడళ్లు, దిశా పోలీస్ స్టేషన్ మొదలగు ప్రాంతాలలో ఫ్లెక్సీలు, బ్యానర్లను ఏర్పాటు చేయించాలన్నారు. మధ్యవర్తిత్వానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేయించాలన్నారు. ఈ నెల 10 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం వారాంతపు రోజున 16వ తేదీన మధ్యవర్తిత్వ ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ర్యాలీలు, వన్‌కే వాక్‌తోపాటు, బహిరంగ సమావేశాలను విస్తృతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ పాల్గొన్నారు.

ముగిసిన బాడీ బిల్డింగ్ పోటీలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నగరంలోని సాయి శ్రీనివాస గార్డెన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఓపెన్ బాడీ బిల్డింగ్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో విశాఖ పట్నంకు చెందిన విక్రమ్ చాంపియన్ ఆఫ్ చాంపియన్‌గా, తణుకుకు చెందిన నాగేంద్ర రన్నరప్‌గా నిలిచారు. విక్రమ్‌కు రూ.40 వేలు, ట్రోఫీ, సర్టిఫికెట్ అందజేశారు. నాగేంద్రకు రూ.20 వేలు, ట్రోఫీ, సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. అలాగే వివిధ క్యాటగిరిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గవ, ఐదవ స్థానాలో నిలిచిన వారికి నగదు బహుమతులతోపాటు మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ చైర్మన్ ఇ.వై కుమార్, జిల్లా అధ్యక్షుడు నూనె నాగేష్, కార్యదర్శి యూనస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

వైభవంగా హుసేనిపీర్ దర్గా ఉరుసు


స్వామి వారి సమాధిని పూలచాదర్‌తో అలంకరించిన దృశ్యం


విద్యుద్దీపాల అలంకరణలో దర్గా

వేలాదిగా తరలివచ్చిన భక్తులు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని దర్గావీధిలో వెలసిన హుసేని పీర్ దర్గా 200వ ఉరుసు మహోత్సవాలు స్వామి ఐదవ తరం వారసులు మున్వర్‌బాషా, సలీం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగాయి. ఉరుసు సందర్భంగా బద్వేలు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి భారీగా భక్తులు తరలిరావడంతో దర్గా ఆవరణమంతా భక్తులతో కిక్కిరిసింది. ఇందులో భాగంగా తెల్లవారుజామున స్వామి వారసులు గంధం ఎత్తుకుని మేళతాళాల నడుమ ఊరేగింపుగా వెళ్లి స్వామి సమాధికి ఎక్కించి అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా ఆవరణలో మొక్కుబడి ఉన్న భక్తులు అన్నదానం నిర్వహించారు. చివరిరోజు కావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఉరుసు సందర్భంగా రాత్రి ఏర్పాటు చేసిన ఖవ్వాలి కార్యక్రమం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. అలాగే పకీరుల విన్యాసాలు అబ్బురపరిచాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అర్బన్ సీఐ రాజగోపాల్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్వామి వారసులు దర్గారహమతుల్లా, దర్గాషఫివుల్లా, దర్గాకరీముల్లా, ఆర్గనైజర్లు షరీఫ్, అంజాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.